
సాక్షి ఒడిశా

ఆదివారం । 23 । ఏప్రిల్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.5,33,928
బంగారం	20 గ్రాములు
వెండి	27 గ్రాముల 800 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



ఝార్సుగుడ బరిలో 10 మంది

- అర్హులను ప్రకటించిన ఎన్నికల సంఘం

- IIలో



క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు

- IIలో

న్యూస్‌రీల్

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

జయపురం: గ్రామీణ నీటి సరఫరా, శానిటేషన్ విభాగంలో పంపు ఆపరేటర్లు, మెకానిక్‌లుగా పనిచేస్తున్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని జయపురం శ్రీ జగత్ జననీ మహాసంఘ్, ఒడిశా రాష్ట్ర కార్మిక, పంపు ఆపరేటర్ల సంఘం కొరాపుట్ జిల్లా విభాగం సభ్యులు జయపురం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఏళ్లుగా కష్టపడి పని చేస్తున్న తమకు పనికి తగిన వేతనం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తించి, రోజుకు రూ.550లే వేతనంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులందరికీ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరారు. పంచాయతీ సమితిల్లో జరిగే సమావేశాలకు హాజరయ్యే తమకు కనీసం రోజుకు రూ.200లు డీఏ, టీఏలు చెల్లించాలన్నారు. అలాగే రూరల్ వాటర్ సప్లయ్ విభాగంలో ఖాళీలను భర్తీ చేయాలని కోరుతున్నట్లు పంపు ఆపరేటర్ల సంఘం కొరాపుట్ జిల్లా విభాగ అధ్యక్షుడు గోపాల నాయిక్ తెలియజేశారు. సామాజిక సేవకుడు బి.హరిరావు ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో సంఘ అధ్యక్షుడు గోపాల నాయిక్, కార్యదర్శి జగదీష్ పూజారి, ఉపాధ్యక్షుడు కుమార్ నాయిక్, సహాయ కార్యదర్శి రామచంద్ర నాయిక్, సలహాదారు భాస్కర నాయిక్, హరి మాలి, సురేంద్ర నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ నోటీసులు

భువనేశ్వర్: కటక్‌లో 2021 ఏప్రిల్ 15వ తేదీన మురుగు నీటి కాలువ శుభ్రం చేస్తుండగా ఊపిరాడక చనిపోయిన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు పరిహారం చెల్లించలేదో వివరణ ఇవ్వాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ నోటీసులు జారీ చేసింది. కార్మికుల మరణానికి ఒడిశా ప్రభుత్వమే కారణమని అభిప్రాయపడింది. నోటీసులు అందుకున్న 4 వారాల గడువులోగా చర్యలు చేపట్టాలని స్పష్టం చేసింది. మృతుల కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున పరిహారం ఎందుకు చెల్లించలేదో చెప్పాలని వివరణ కోరింది. అలాగే చికిత్స పొందిన వ్యక్తికి వైద్య సౌకర్యం, ఇతరేతర పరిహారం చెల్లించారా లేదా అనే వివరణ దాఖలకు ఆదేశించింది. ఈ విషాద సంఘటనలో ఇద్దరు వ్యక్తులు మరణించగా, ఒకరు చికిత్స కోసం ఆస్పత్రి పాలయ్యాడు. ఈ చర్య మానవ హక్కుల ఉల్లంఘనగా కమిషను పరిగణించింది. ఈ సంఘటనకు రాష్ట్రం ప్రభుత్వం పూచీదారీగా కమిషను పేర్కొని వివరణకు సముచిత గడువు మంజూరు చేసింది. మృతులు పట్టాపూర్‌కు చెందిన పి.శంకర్, కటక్ జిల్లా బొడొంబా ప్రాంతీయుడు బిష్ణు నాయక్‌గా గుర్తించారు.

అదృశ్యమైన ఫైళ్లు లభించాయి

- న్యాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ధనేశ్వర్ మల్లిక్



మాట్లాడుతున్న ధనేశ్వర్ మల్లిక్

భువనేశ్వర్: జగన్నాథ ఆలయ అడ్మినిస్ట్రేషన్ (ఎస్‌జేటీఏ)కి చెందిన రెండు ఫైళ్లు అదృశ్యమై కలకలం రేపిన విషయం తెలిసిందే. అయితే ఈ రెండు ఫైళ్లు లభించినట్లు రాష్ట్ర ప్రభుత్వం శనివారం స్పష్టం చేసింది. కనుమరుగైన ఫైళ్లను వెతికేందుకు అత్యవసర ఆదేశాలు జారీ చేశామని న్యాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ధనేశ్వర్ మల్లిక్ తెలిపారు. ఈ వెతికితీతలో కనిపించకుండా పోయిన 2 ఫైళ్లు దొరికాయన్నారు. సంబంధిత రెండు ఫైళ్లు ఇతర ఫైళ్లతో కలిసిపోవడంతో ట్రేస్ చేయడం కష్టమైందన్నారు. అంతకుముందు ఫైళ్లను ప్రాధాన్యత ప్రాతిపదికన గుర్తించాలని ఆ శాఖ డిప్యూటీ సెక్రటరీ తన పరిధిలోని అన్ని విభాగాలకు లేఖ రాయడంతో జాడలేని ఫైళ్లకు సంబంధించిన విషయం తెరపైకి వచ్చింది. వివాద పరిష్కారానికి హైకోర్టు ఆశించిన అత్యంత కీలకమైన ఫైళ్లు కావడంతో అలజడి రేగింది. గాలింపులో కనిపించకుంటే తదుపరి కార్యాచరణకు సిద్ధం కావాలని విభాగం స్పష్టం చేసింది. శ్రీజగన్నాథ ఆలయ అడ్మినిస్ట్రేషన్ (ఎస్‌జేటీఏ)కి సంబంధించి రెండు ముఖ్యమైన ఫైళ్లలో జేటీఏ-55/2006 (పార్టు), జేటీఏ-06/2014 నంబర్ల 2 ఫైళ్లు ఉన్నట్లు న్యాయశాఖ జారీ చేసిన సర్క్యులర్‌లో పేర్కొంది.

అక్షయ తృతీయ వేడుక..

శ్రీమందిరం వేదిక

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ప్రారంభం కానున్న చందన యాత్ర
- రథాల తయారీకి అంకురార్పణ
- పటిష్ట బందోబస్తు ఏర్పాటు



నావల తయారీ పనులు పరిశీలిస్తున్న దృశ్యం



నరేంద్ర కొలనులో చందన యాత్ర ఏర్పాట్ల పర్యవేక్షణలో సూపరింటెండెంట్ డాక్టర్ కన్వర్ సింగ్

భువనేశ్వర్: శ్రీ క్షేత్రంలో అక్షయ తృతీయ ఉత్సవం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వామి వార్షిక రథయాత్ర నిర్వహణతో అక్షయ తృతీయకు అత్యంత ప్రాధాన్యత ఉంది. దీంతో శ్రీక్షేత్రంలో ధార్మిక, ఆధ్యాత్మిక, శ్రీజగన్నాథుని సంస్కృతి విలువలతో ఈ ఉత్సవం నిర్వహణకు యంత్రాంగం సకల ఏర్పాట్లు దాదాపు పూర్తి చేసింది. శ్రీ జగన్నాథుని వార్షిక యాత్ర రథాల తయారీకి ఈ తిథి పురస్కరించుకుని అంకురార్పణ చేస్తారు. అక్షయ తృతీయ పురస్కరించుకుని ఆదివారం వేకువజామున 3 గంటలకు స్వామివారి సన్నిధి తలుపులు తెరుస్తారు. అనంతరం 4 గంటలకు అంతర్గత శుద్ధి, మంగళ హారతి, మైలమ్, యాత్రాంగి మహాస్నానం, సర్వాంగ అలంకారం తర్వాత దక్షిణ మండపంలో మధ్యాహ్నం 1 గంట నుంచి 2.30 గంటల వరకు మధ్యాహ్న ధూపదీపాదులు నిర్వహిస్తారు.

చందన యాత్ర

జగన్నాథుని వార్షిక ద్వాదశ యాత్రల్లో చందన యాత్ర ఒకటి. అక్షయ తృతీయ పురస్కరించుకుని ఈ యాత్ర ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా చందన లేపిత ఉత్సవమూర్తులు స్థానిక నరేంద్ర కొలనులో నౌకా విహారంలో పాల్గొంటారు. ఈ యాత్ర మధ్యాహ్నం 3.30 గంటల నుంచి ప్రారంభించేందుకు సమయం ఖరారు చేశారు. ఈ యాత్ర రెండు విడతల్లో సమగ్రంగా 42 రోజులు కొనసాగుతుంది. తొలి విడత వెలుపల చందన యాత్ర కాగా, మలి విడత లోపలి చందన యాత్రగా పరిగణిస్తారు. ఈ రెండు విడతలు 21 రోజుల చొప్పున కొనసాగుతాయి. ఈ యాత్రలో స్వామివారి నడయాడే (ఉత్సవ) మూర్తులు రామకృష్ణ, మదన మోహన్, శ్రీదేవి, భూదేవి సహిత పంచపాండవ సమేతంగా నరేంద్ర కొలనులో 21 రోజుల పాటు నౌకా విహారం, జల క్రీడల్లో పాల్గొనడం చూడముచ్చట గొలుపుతుంది. ఏటా చైత్ర పూర్ణిమ రోజున నరేంద్ర కొలను నుంచి సేవకులు నంద, భద్ర నావలను యాత్రకు అనుకూలంగా సిద్ధం చేయడం ఆచారం. ఈ క్రమంలో మహరణ, భొయ్ సేవకులు నంద, భద్ర నావల నిర్మాణ పనులు పూర్తి చేసి సిద్ధం చేశారు. వెలుపల చందన యాత్ర నిర్వహణ కోసం స్థానిక నరేంద్ర కొలను ముస్తాబు తుది మెరుగులు దిద్దుకుంటుంది. పూరీ జిల్లా పోలీసు సూపరింటెండెంటు డాక్టర్ కన్వర్ సింగ్ వెలుపల చందన యాత్ర భద్రతా ఏర్పాట్లను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. నరేంద్ర కొలనులో జగన్నాథుడు నౌకా విహారం చేయడం వెలుపల చందన యాత్ర విశిష్టత. నిత్యం సంధ్య వేళలో జరిగే ఈ నౌకా విహారం భక్తులు అత్యంత ఆనందోత్సాహాలతో తిలకిస్తారు. ఈ మేరకు కొలను తీరంలో అవాంఛనీయ సంఘటనలు నివారించేందుకు ప్రత్యేక జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. ఈ ఏర్పాట్లుని ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు.



రథాల తయారీకి చలువ పందిళ్లతో సిద్ధమైన నిర్మాణ శాల

రథ తయారీ అంకురార్పణ

ప్రస్తుతం చందన యాత్ర సన్నాహాలు పూర్తవ్వడంతో రథాల తయారీకి అంకురార్పణ సన్నాహాలు ప్రారంభిస్తారు. శ్రీమందిరం రత్న వేదిక నుంచి మూల విరాటుకు ఆజ్ఞామాల చేరడంతో ఈ ప్రక్రియకు శ్రీకారం చుడతారు. అంతకుముందు ఆలయ పాలక మండలి మూడు 12 అడుగుల పొడవైన కలప దుంగలను రథ నిర్మాణ శాల ఆవరణలో సిద్ధం చేస్తుంది. శ్రీమందిరం సింహద్వారం ఆవరణ బొడొ దండొ ప్రాంగణంలో చలువ పందిళ్లతో రథ నిర్మాణ శాల సిద్ధమైంది.

పటిష్ట బందోబస్తు


నరేంద్ర కొలను పరిసరాల్లో గట్టి భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. బందోబస్తు కోసం 8 ప్లాటూన్ల పోలీసులను నియమిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. 25 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు, సహాయ సబ్ ఇన్‌స్పెక్టర్లతో (ఏఎస్‌ఐ) ఇద్దరు అదనపు పోలీసు సూపరింటెండెంట్లు, ముగ్గురు డీఎస్పీలు, 7గురు ఇన్‌స్పెక్టర్లు శాంతి భద్రతల కార్యకలాపాల్లో పాలుపంచుకుంటారు.

● ఈద్ ముబారక్

రాష్ట్రవ్యాప్తంగా ముస్లిం కుటుంబాలు పవిత్ర రంజాన్ పండగను శనివారం వేడుకగా జరుపుకున్నాయి. ఈ సందర్భంగా అన్ని మసీదులు, ఈద్గా మైదానాలు కిటకిటలాడాయి. మసీదుల్లో ప్రత్యేకంగా సామూహిక ప్రార్థనలు జరిపారు. ప్రార్థనల అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఒడిశా ప్రజలకు రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషీ లాల్, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ శుభాకాంక్షలు తెలిపారు. - భువనేశ్వర్



భువనేశ్వర్: ఖుర్దా రోడ్ మసీదులో ఈద్ సామూహిక ప్రార్థనలో ముస్లిం సోదరులు



భువనేశ్వర్: పూరీ సాగర తీరంలో సుదర్శన్ పట్నాయక్ సైకత శిల్పం



బరంపురం: బెరక్స్ పడియాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



రంజాన్ వేడుకల్లో పెద్దలతో పాటు చిన్నారులు



పర్లాకిమిడి: రంజాన్ సందర్భంగా శ్యాంతి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఉరి వేసుకొని విద్యార్థి మృతి

జయపురం: సదర్ పోలీసుస్టేషన్ పరిధి కుమిలిపుట్ గ్రామంలో 14 ఏళ్ల విద్యార్థి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన పూరబదాస్ ముదలి కుమారుడు చందన ముదులి 8వ తరగతి చదువుతున్నాడు. అతను శనివారం ఉదయం 9 గంటల సమయంలో తమ గోదాములో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. విషయం తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు సమీపంలో ఆస్పత్రికి తీసుకెళ్లినా, అప్పటికే విద్యార్థి మృతి చెందినట్లు డాక్టర్లు ప్రకటించారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరు అయ్యారు. ఘటనపై ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, విచారిస్తున్నట్లు పోలీసుస్టేషన్ అధికారి ఈశ్వర తండి వెల్లడించారు.

అనుమానస్పద స్థితిలో యువకుడి మృతదేహం

మరో సంఘటనలో జయపురం పోలీసుస్టేషన్ పరిధి పారాబెడ శ్రీనగర్‌లో ఒక ఇంటిలో అద్దెకుంటున్న యువకుడు, తానుంటున్న ఇంటిలో శవంగా కనిపించాడు. శుక్రవారం సాయంత్రం ఇంటి ఓనర్ రాజారాం సింగ్ జయపురం పట్టణ పోలీసుస్టేషన్‌కు వచ్చి, తమ ఇంటిలో అద్దెకు ఉంటున్న జుధిష్టర్ సాహు ఇంటి తలుపులు ఉదయం నుంచి తెరవడం లేదని ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు వచ్చి జుధిష్టర్ సాహు ఉంటున్న ఇంటి తలుపులు పగలగొట్టి చూడగా జుదిష్టర్ మంచంపై శవమై పడి ఉండడం కనిపించింది. వెంటనే అతడి మృతదేహాన్ని జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి, బరంపురంలో ఉన్న కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగిస్తామని వెల్లడించారు.



పారాబెడ శ్రీరామ్ నగర్‌లో యువకుని మృతదేహం

కోర్టు అనుమతించినా జాప్యమెందుకు..?

- పంచాయితీ కార్యాలయం నిర్మించండి
- బీడీవోను కలిసిన కరమిటి గ్రామస్తులు



బీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజలు

జయపురం: కుంద్రా సమితి కరమిటి గ్రామంలో పంచాయతీ కార్యాలయం నిర్మించేందుకు కోర్టు తీర్పునిచ్చినా జాప్యమెందుకు చేస్తున్నారని ఆ గ్రామ ప్రజలు బీడీవో రాంప్రసాద్ దొరను ప్రశ్నించారు. ఈ మేరకు శుక్రవారం వంద మందితో బీడీవోను కలిసి పంచాయతీ కార్యాలయం నిర్మించాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సమితి మాజీ అధ్యక్షుడు సురేంద్ర పొరజ మాట్లాడుతూ.. బహుళ ఆదివాసీ ప్రాంతమైన కరమిటిని గ్రామ పంచాయతీగా ప్రకటించి 20 ఏళ్లు పూర్తయ్యిందన్నారు. అప్పట్లో కరమిటి గ్రామంలోనే పంచాయతీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని పంచాయతీలో 80 శాతం మంది కోరగా, మిగతా 20 శాతం మంది సమీప ఖెందుగుడ గ్రామంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేయటంతో సమస్య తలెత్తిందన్నారు. ఈ నేపథ్యంలో ఖెందుగుడలో పంచాయతీ కార్యాలయం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసినవారు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారని వెల్లడించారు. అప్పటి నుంచి గత 20 ఏళ్లుగా పంచాయతీ కార్యాలయం ఒక పూరి గుడిసెలో కరమిటి గ్రామంలో కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మధ్యలో నాలుగు సార్లు పంచాయతీ ఎన్నికలు జరిగి సర్పంచ్‌లు ఎన్నుకోబడినా, నేటికీ వివాదం వలన పంచాయతీ కార్యాలయ నిర్మాణం జరుగలేదన్నారు. అయితే ప్రస్తుతం కరిమిటి గ్రామంలోనే పంచాయతీ కార్యాలయం నిర్మించాలని కోర్టు తీర్పునిచ్చిందని వెల్లడించారు. విషయం జిల్లా కలెక్టర్, జయపురం సబ్ కలెక్టర్లకు తెలియజేసినా నిర్మాణం జరుగలేదని, ఇప్పటికైనా నిర్మాణం చేపట్టాలని కోరారు.

ఉచిత కంటివైద్య శిబిరం

బరంపురం: స్థానిక హరఖండి వద్దనున్న విశ్వకర్మ మందిర కల్యాణ మండపంలో బరంపురం మహానగర్ బిజు యువజన దళం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. బరంపురం ఎంపీ చంద్రశేఖర్ సాహు, ఎమ్మెల్యే విక్రమ్ పండాలు శిబిరాన్ని ప్రారంభించారు. ఎంకేసీజీ మెడికల్ కంటి విభాగం సహకారంతో స్థానిక ప్రజలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో నగర బీజేడీ యువజన నాయకులు పాల్గొన్నారు.



కంటి వైద్య శిబిరం ప్రారంభిస్తున్న ఎంపీ చంద్రశేఖర్ సాహు, ఎమ్మెల్యే విక్రమ్ పండా తదితరులు

శివ మందిరంలో చోరీ



శివ మందిరం

రాయగడ: స్థానిక గౌతమ్ నగర్‌లో ఉన్న శివ మందిరంలో చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు మందిరం తలుపులకు ఉన్న తాళాలను విరగ్గొట్టి హుండీలో ఉన్న నగదును దొంగలించారు. ఈ మేరకు మందిరం కమిటీ అధ్యక్షుడు డాక్టర్ ప్రేమ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎప్పటిలాగే మందిరం అర్చకులు విధులను నిర్వహించి శుక్రవారం రాత్రి తలుపులు మూసివేశారు. శనివారం ఉదయం యథావిధిగా అర్చనలు చేయడానికి తలుపులు తెరిచేందుకు వెళ్లగా, అప్పటికే మందిరంలో ప్రధాన ద్వారం తలుపులు తెరిచి ఉండడం గమనించి, విషయాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడికి తెలియజేశారు. దుండగులు భక్తులు కానుకలకు సంబంధించిన హుండీని విరగ్గొట్టి నగదు దోచుకున్నారని గమనించారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గత మూడు నెలలుగా హుండీ తెరువలేదని మందిరం కమిటీ అధ్యక్షుడు తెలియజేశారు.



భక్తులు కానుకలు వేసే హుండీ

సైనికా.. సెలవిక



స్వగ్రామంలో దేబాశిష్ బిశ్వాల్ అంతిమ యాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

- జవాన్ దేబాశిష్ బిశ్వాల్‌కు కన్నీటి వీడ్కోలు
- విమానాశ్రయంలో గార్డ్ ఆఫ్ ఆనర్

భువనేశ్వర్: జమ్మూకాశ్మీర్ పూంచ్‌లో గురువారం జరిగిన ఉగ్రవాదుల దాడిలో మరణించిన సత్యబాదికి చెందిన దేబాశిష్ బిశ్వాల్ భౌతికకాయం శనివారం ఉదయం భువనేశ్వర్‌కు చేరింది. ఈ సందర్భంగా స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం (బీపీఐఏ) ప్రాంగణంలో గార్డ్ ఆఫ్ ఆనర్ ప్రదానం చేశారు. రాజకీయ నేతలు, ప్రభుత్వ అధికారులు, పోలీసు సిబ్బంది, సామాన్య ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

గవర్నర్ ప్రొఫెసర్ గణేషీ లాల్, సీనియర్ ఆర్మీ అధికారులు దేబాశిష్ భౌతికకాయం దగ్గర నివాళులర్పించి ఊరేగింపుగా పూరీ జిల్లా సత్యబాది మండలం అలగుమ్ స్వగ్రామానికి వీడ్కోలు పలికారు. జవాను అంత్యక్రియలు స్వగ్రామం ఖొండాయత్ సాహి శ్మశానవాటికలో నిర్వహించారు. పూర్తి సైనిక, రాష్ట్ర ప్రభుత్వ గౌరవాలతో అంత్యక్రియలు చేపట్టారు. ఆ గ్రామమంతా భారత్ మాతా కీ జై.. దేబాశిష్ బిశ్వాల్ అమర్ రహే నినాదాలతో ప్రతి ధ్వనించింది. పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది ప్రజలు అంతిమ యాత్రలో పాల్గొన్నారు. బిశ్వాల్ 2013లో భారత సైన్యంలో చేరాడు. గతేడాది ఏప్రిల్ 22న అక్షయ తృతీయ శుభ సందర్భంగా తొలి వివాహ వార్షికోత్సవం జరుపుకున్నారు. వీరి దంపతులకు 7 నెలల పసిపాప ఉంది. దివంగత జవాన్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది.



విమానాశ్రయంలో దేబాశిష్ బిశ్వాల్‌కు నివాళులర్పిస్తున్న గవర్నర్ ప్రొఫెసర్ గణేషీ లాల్

క్లుప్తంగా

ఆదిత్యలో పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన బీఎస్ అండ్ హెచ్ విభాగం హెచ్ఓడీ ప్రొఫెసర్ ఆర్.శాంతికుమార్ రచించిన 'అప్లికేషన్ ఆఫ్ స్టాటిస్టిక్స్ ఇన్ కంప్యూటర్ సైన్స్' అనే పుస్తకాన్ని కళాశాల డైరెక్టర్ వి.వి. నాగేశ్వరరావు శనివారం ఆవిష్కరించారు. కృత్రిమ మేథ, మిషన్ లెర్నింగ్, బిగ్ డేటా అనాలసిస్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్‌లో నూతన ఆవిష్కరణలు చేసే వారికి ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడతుందని రచయిత పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, అధ్యాపకులు ఎ.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

నీలమణిదుర్గ ఉత్సవాలు ప్రారంభం



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం నీలమణిదుర్గ అమ్మవారి 48వ మహోత్సవాలు శనివారం ఎమ్మెల్యే రెడ్డి శాంతి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఈవో వాసుదేవరావు, ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యేను ఆలయంలోకి ఆహ్వానం పలికారు. అనంతరం అమ్మవారికి ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ నెల 30 వరకు ఉత్సవాలు కొనసాగుతాయని చైర్మన్ చెప్పారు. పూజా కార్యక్రమంలో విశ్రాంత ఆలయ ఈవో డకర రమణయ్య, వైస్ ఎంపీపీ సవిరిగాన ప్రదీప్, రజక సంఘ అధ్యక్షుడు జి.వెంకటరమణ, వైఎస్సార్ సీపీ నాయకులు కర్రి లక్ష్మినారాయణ, పడ్డ నేతాజీ, ఎస్.కృష్ణారావు, దువ్వారి జోగారావు, జి.రాము, ఎం .వరదరాజు తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ ఔదార్యం



సాధువులకు అన్న, వస్త్రాలను అందిస్తున్న రామారావు, క్లబ్ సభ్యులు

ఇచ్ఛాపురం రూరల్: స్థానిక హెడ్ కానిస్టేబుల్ తెలుకల రామరావు మరోసారి ఔదార్యం చాటుకున్నారు. ఇటీవల లొద్దపుట్టి హైవే బ్రిడ్జీ కింద వడదెబ్బతో మృతి చెందిన యాచకుని మృతదేహాన్ని రూరల్ పోలీసులతో కలసి ఖననం చేసిన విషయం విదితమే. శనివారం నాటికి దశ దిన ఖర్మ కావడంతో హెచ్‌సీ రామారావు అలయన్స్ క్లబ్ సభ్యులతో కలిసి ధనరాజ్ తులసమ్మ, పట్టణంలోని బస్టాండ్ కూడలి, స్వేచ్ఛావతి అమ్మవార్ల ఆలయం సమీపంలోని సాధువులు, యాచకులకు, పేదలకు ఆహార పొట్లాలతో పాటు నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో అలయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నరసింహమూర్తి, తిప్పన లక్ష్మణమూర్తి, పీఆర్‌ఓ దక్కత గోపీనాథ్, కోశాధికారి సత్యమ్మయ్య, ఉమాశంకర్, బాలా, బుజ్జి, భీష్మ, వాసు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



వ్యక్తి మృతదేహం

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్ ఆవరణలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సుమారు 50 నుంచి 60 ఏళ్లు కలిగి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. రైల్వే పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యాపారి మృతి

ఇచ్ఛాపురం: జాతీయ రహదారిపై పాతటోల్ ప్లాజా వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యాపారి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. కంచిలి మండలం ఎంఎస్‌పల్లి గ్రామానికి చెందిన కొత్తకోట డిల్లేశ్వరరావు(57) ఇంటిలో తయారు చేసిన అప్పడాలు, వడియాలు విక్రయిస్తూ సోంపేటలో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి వ్యాపారం రీత్యా బరంపురం వెళ్లి తిరిగి వస్తుండగా పాత టోల్ ప్లాజా వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు సందీప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాల్య వివాహాలు నేరం

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని గంజాం జిల్లా ఏడీఎం లీనచాంద్ కేశవం హెచ్చరించారు. ఛత్రపూర్‌లోని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సబంధింత అధికారులతో సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఎం మాట్లాడుతూ.. బాల్య వివాహాలు వలన బాలికలకు అనేక ఇబ్బందులు తలెత్తుతాయని తెలియజేశారు. చిన్న వయస్సులో గర్భధారణ వలన తల్లీబిడ్డలకు ప్రమాదం ఉంటుందని పేర్కొన్నారు. దీనిపై అవగాహన కలిpంచాలని సూచించారు. జిల్లాలోని ప్రతీ బ్లాక్‌లో అంగన్‌వాడీలు, స్వచ్ఛంద సంస్థలు అవగాహన శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అదనపు జిల్లా కలెక్టర్ సరోజ్ మిశ్రాతో పాటు 22 బ్లాక్‌లకు చెందిన బీడీవోలు పాల్గొన్నారు.

– బరంపురం



రక్తదాన శిబిరం



స్థానిక టౌన్‌హాల్‌లో సుభాష్ చంద్రబోస్ ట్రస్టు అధినేత జి.శ్రీనివాసరావు జన్మదినం సందర్భంగా భారీ రక్తదాన శిబిరం శనివారం నిర్వహించారు. మల్కన్‌గిరి జిల్లాలో ఎవరికి రక్తం అవసరమైనా శ్రీనివాస్‌రావు ముందుంటారు. దీంతో ఆయన పుట్టినరోజు సందర్భంగా 151 మంది రక్తదానం చేశారు. మొత్తం 101 యూనిట్ల రక్తం సేకరించడంతో మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి ప్రఫుల్ల కుమార్ నాందో అభినందనలు తెలియజేశారు. ఇకపై ఆస్పత్రిలో ఎవరికైనా రక్తం అవసరం వస్తే అందుబాటులో ఉన్న ఈ రక్తాన్ని అందజేస్తామని పేర్కొన్నారు. రక్తదానం చేసినవారికి ప్రశంసా పత్రాలు అందజేశారు.

– మల్కన్‌గిరి

బాల్య వివాహ రహిత జిల్లా

ఒడిశా రాష్ట్రంలో బాల్య వివాహ రహిత జిల్లాగా గజపతి జిల్లా నిలుస్తోందని కలెక్టర్ లింగరాజ్ పండా తెలియజేశారు. దేశ రాజధాని ఢిల్లీలోని విజ్ఞాన భవన్‌లో 16వ పౌర సేవా దినోత్సవం సందర్భంగా భారత ప్రభుత్వ పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు ఏర్పాటు చేసిన ప్యానెల్ ప్రోగ్రాంకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో శతశాతం నీటి పారుదల, ఉన్నత విద్యకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని తెలియజేశారు. దీనికి నీతి అయోగ్ సీఈవో బి.వి.ఆర్.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గతంలో గజపతి జిల్లా కలెక్టర్ ఉత్తమ మౌలిక వసతులు కలిగిన జిల్లాగా అనేక అవార్డు అందుకున్నారని కొనియాడారు.

– పర్లాకిమిడి



క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు



సమావేశంలో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు



మాట్లాడుతున్న ఉపాధ్యాయురాలు

జయపురం: విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని హెచ్‌ఎం ప్రకాశ చంద్ర పట్నాయిక్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల సంయుక్త సమావేశం పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను క్రమశిక్షణతో ఉత్తములుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర ముఖ్యమైనదన్నారు. తల్లిదండ్రులు విద్యార్థుల నడవిడిక, చదువుపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో యజ్ఞేశ్వర పండ, విష్ణురంజన్ గౌఢ, దుర్గా ప్రసాద్ పాత్రో, భగవాన్ శాబత్ తదితరులు పాల్గొన్నారు.

ఝార్సుగుడ బరిలో 10 మంది

- అర్హులను ప్రకటించిన ఎన్నికల సంఘం

భువనేశ్వర్: ఝార్సుగుడ అసెంబ్లీ నియోజక వర్గం ఉప ఎన్నిక పోటీకి అర్హులైన అభ్యర్థుల్ని ఎన్నికల యంత్రాంగం అధికారికంగా ప్రకటించింది. రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులతో సహా 10 అభ్యర్థుల నామినేషన్లు చెల్లుబాటు అయినట్లు శనివారం ప్రకటించారు. ఈ నియోజకవర్గం ఉప ఎన్నికలో పోటీ చేసేందుకు 14 మంది అభ్యర్థులు మొత్తం 22 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. శనివారం వీటిని పరిశీలించి పోటీకి అర్హులైన అభ్యర్థుల జాబితాని ఎన్నికల కమిషను వెల్లడించింది. పరిశీలనలో వివిధ కారణాలతో నలుగురు అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. అయితే మూడు ప్రధాన పార్టీల అభ్యర్థుల నామినేషన్లు చెల్లుబాటు అయినట్లు ప్రకటించారు. వీరిలో అధికార బిజూ జనతా దళ్ అభ్యర్థి దీపాలి దాస్, భారతీయ జనతా పార్టీ అభ్యర్థి టొంకొధొరొ త్రిపాఠి, కాంగ్రెస్ అభ్యర్థి తరుణ్ పాండే ఉన్నారు. ఝార్సుగుడ ఉప ఎన్నికలో తలపడేందుకు మరో ఏడుగురు స్వాతంత్ర్య అభ్యర్థులుగా అర్హత సాధించారు. వీరిలో రోహిదాస్, మనీష్ శర్మ, మహేంద్ర పట్నాయక్, బిజయ్ జలాన్, జ్ఞానేంద్ర బెహరా, భువనేశ్వర్ గార్డియా, మహేంద్ర లుహా ఉన్నారు. నామినేషన్ల ఉప సంహరణ గడువు ఈనెల 24తో పూర్తి అవుతుంది. అనంతరం బరిలో మిగిలిన అభ్యర్థుల జాబితా వెలువడుతుంది. భారత ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ప్రకారం మే 10న ఉప ఎన్నిక పోలింగ్ నిర్వహిస్తారు. మాజీ ఆరోగ్య మంత్రి నవ కిషోర్ దాస్ హత్యతో ఝార్సుగుడ అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఉప ఎన్నిక అనివార్యమైంది.

మూలపేట పోర్టుతో

జిల్లాకు ప్రత్యేక స్థానం

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

మందస: శ్రీకాకుళం జిల్లా అంటే వెనుకబడిన ప్రాంతంగా గుర్తింపు ఉండేదని, మూలపేట పోర్టుతో దాదాపుగా ఈ నానుడికి శుభం కార్డు పడుతుందని రాష్ట్ర పశుసంవర్థక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మందస మండలం కొత్తపల్లిలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పాలకుల హయాంలో జిల్లా ప్రజలు ఇతర రాష్ట్రాలు, దేశాలకు వలస వెళ్లిపోయేవారన్నారు. అటువంటి సమయంలో జిల్లాకు పరిశ్రమలు తీసుకురావాలనో, పోర్టులు నిర్మించాలనో నిర్ణయం తీసుకోలేదని ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక జిల్లా రూపురేఖలు మారుతున్నాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో టీడీపీ నాయకులకు నిద్ర పట్టడంలేదన్నారు. శ్రీకాకుళం జిల్లాకు పదేళ్ల పాటు ఎంపీగా పని చేసిన కింజరాపు రామ్మోహన్నాయుడు చేసేందేమీలేదని మంత్రి అప్పలరాజు ధ్వజమెత్తారు. టీవీల్లో కనిపించడం, పేపర్లో ప్రకటనలకే పరిమితమయ్యారన్నారు. పోర్టు.. ఎన్నికల జిమ్మిక్కంటూ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎంపీ పదేళ్ల పాలనలో పలాస రైల్వేస్టేషన్‌కు స్టీల్ కుర్చీలు మాత్రమే ఏర్పాటు చేశారన్నారు. చంద్రబాబుకు తొత్తుగా వ్యవహరిస్తున్నారే తప్ప ప్రజలకు ఒరిగిందేమీలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచ్ శనాపతి దివ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, జెడ్పీటీసీ సవర చంద్రమ్మ, ఎంపీటీసీ కర్రి తిరుమల, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు, మండల కోఆప్షన్ సభ్యుడు యవ్వారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

కాశీబుగ్గ: పలాస మండలం తర్లాకోట పంచాయతీ పరిధిలోని కాటమ్మతల్లి ఆలయం వద్ద శనివారం విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొట్టింది. గొప్పిలి నుంచి వస్తూ మలుపు వద్ద తిరుగుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో కారు డ్రైవర్‌తో పాటు బాలుడికి తీవ్రగాయాలు కావడంతో స్థానికుల పలాస ఆసుపత్రికి తరలించారు. కారు ఢీకొట్టిన ఘటనలో మెళియాపుట్టి, పలాసకు మధ్య హెవీలైన్ తెగిపడటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పొలంలో తీగలు పడటంతో ప్రాణాపాయం తప్పింది. మెళియాపుట్టి సబ్‌స్టేషన్ సిబ్బంది వచ్చి సరఫరా నిలిపివేశారు.



కారు ఢీకొనడంతో విరిగిన స్తంభం

కన్నీటి సంద్రం





రోదిస్తున్న తల్లిదండ్రులు, బంధువులు (ఇన్‌సెట్‌లో) సాద్వికశ్రీ మృతదేహం

- కుక్కల దాడిలో మృతి చెందిన చిన్నారి సాద్వికశ్రీ అంత్యక్రియలు పూర్తి

జి.సిగడాం: మెట్టవలసలో కుక్కల దాడిలో మృతిచెందిన 16 నెలల చిన్నారి సాద్వికశ్రీ అంత్యక్రియలు శనివారం పూర్తయ్యాయి. తమ ముద్దుల చిన్నారి ఇక లేదని తెలిసి తల్లిదండ్రులు రోదించిన తీరు అక్కడివారిని కలచివేసింది. ఈ నెల 21న పైల రాంబాబు, రామలక్ష్మీ దంపతుల రెండో కుమార్తె సాద్వికశ్రీ కుక్కల దాడిలో మృతి చెందిన సంగతి తెలిసిందే. గ్రామస్తులంతా కలిసి చిన్నారి మృతిపై కేసు నమోదు చేసి పోస్టుమార్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు గ్రామానికి చేరుకుని వివరాలు స్వీకరించారు. అనంతరం రాజాం ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుక్కల దాడిలో చిన్నారి మృతి చెందడం బాధాకరమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఫోన్ ద్వారా సంతాపం తెలియజేశారు. కుటుంబసభ్యులను అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.

విద్యార్థుల తల్లిదండ్రులకు..

అన్యాయం చేస్తారా?



టెక్కలి కంచ్రవీధిలో విద్యార్థుల ప్రగతిని తెలుసుకుంటున్న విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్

- వేలాది రూపాయల జీతం తీసుకుని నిర్లక్ష్యంగా పనిచేస్తున్నారు
- పలువురు ఉపాధ్యాయులపై ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఆగ్రహం
- టెక్కలి ఎంఈఓ, ముగ్గురు ఉపాధ్యాయులపై కఠిన చర్యలకు ఆదేశాలు

టెక్కలి: 'తాము పడుతున్న కష్టాలు పిల్లలు పడకూడదని తల్లిదండ్రులు కష్టపడి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు అప్పగిస్తుంటే మీరంతా వారికి అన్యాయం చేస్తున్నారు. వారు కట్టిన ట్యాక్స్‌లతో వేలాది రూపాయల జీతాలు తీసుకుంటూ కనీసం మానవత్వం లేకుండా ప్రవర్తిస్తున్నారు. ఓ వైపు టోఫెల్ వంటి ప్రపంచ ప్రఖ్యాత గుర్తింపు కలిగిన సర్టిఫికెట్ కోసం ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుంటే.. ఉపాధ్యాయులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు..' అంటూ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శనివారం టెక్కలిలో పలువురు విద్యార్థుల ఇంటికి వెళ్లి వారి విద్యా ప్రగతిని తెలుసుకున్నారు. ముందుగా బీసీ కాలనీ వెళ్లి విద్యార్థుల కోసం ఆరా తీయగా ఎంఈఓ నాగభూషణ్ నుంచి సరైన సమాధానం రాకపోవడంపై మండిపడ్డారు. ఏయే పాఠశాలలో ఏయే ప్రాంతాల విద్యార్థులు చదువుతున్నారో తెలియకపోతే ఎలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

అందరూ గాడిలో పడాలి..

టెక్కలి కంచ్రవీధిలోని విద్యార్థుల ఇళ్లకు వెళ్లి గోరుముద్ద పథకం అమలుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. స్థానిక ఒరియా పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న పద్మిని వర్క్‌బుక్‌లను పరిశీలించగా.. విద్యార్థిని రాసిన సమాధానాలను ఉపాధ్యాయులు చూడకపోవడంపై మండిపడ్డారు. మెయిన్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్న తరుణ్‌కు ఈవీఎస్ పుస్తకం అందకపోవడం, గణితం పుస్తకంలో ఉపాధ్యాయులు ఎటువంటి లెక్కలు ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల ప్రగతిలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఒరియా పాఠశాలకు చెందిన శ్యామలాదేవి, మెయిన్‌స్కూల్‌కు చెందిన ఎ.సురేష్, రమణతో పాటు ఎంఈఓ నాగభూషణ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్‌జేడీ జ్యోతికుమారి, డీఈఓ తిరుమలచైతన్యను ఆదేశించారు. ఈ నలుగురిపై తీసుకునే చర్యలతో రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులంతా సక్రమంగా పనిచేసేలా ఉండాలని స్పష్టం చేశారు. తూతూమంత్రంగా చర్యలు చేపడితే ఆర్‌జేడీ, డీఈఓలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. టెక్కలి మండలంలో అకడమిక్ వ్యవస్థ శూన్యంగా ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా కంచ్రవీధి ఒరియా పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు తపస్వీ పనితీరును మెచ్చుకుంటూ ఆయనతో ఫొటోలు తీసుకుంటూ అభినందించారు.

జిల్లా అధికారులపై అసహనం..

జిల్లా విద్యా శాఖాధికారులపై ప్రిన్సిపల్ సెక్రటరీ అసహనం వ్యక్తం చేశారు. నిన్నటి వరకు డీఈఓగా పనిచేసిన గార పగడాలమ్మ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆరు నెలల ఇన్‌చార్జి బాధ్యతలు కేవలం టైమ్‌పాస్‌గా చేశారంటూ మండిపడ్డారు. కొత్త డీఈఓగా బాధ్యతలు తీసుకున్న తిరుమలచైతన్యను ఉద్దేశించి ప్రవీణ్‌ప్రకాష్ మాట్లాడుతూ.. చిత్తశుద్ధిగా పనిచేయాలనే భావన ఉంటేనే డీఈఓగా కొనసాగాలని, లేనిపక్షంలో పక్కకు తప్పుకోవాలన్నారు. దిగువ స్థాయి సిబ్బందితో మంచి అనిపించుకోవడం కాదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మంచి అనిపించుకోవాలని సూచించారు. ఇదే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయులు, అధికారులతో వచ్చే అకడమిక్ సంవత్సరం నుంచి ఏ విధంగా పనిచేయించాలో తనకు తెలుసని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీసీ ఆర్.జయప్రకాశ్, టెక్కలి సర్పంచ్ గొండేల సుజాత, టెక్కలి తహసీల్దారు బి.గిరిబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

406 మంది ఫొటోలు వాట్సాప్‌లో పంపించండి

టెక్కలి ఎంఈఓ నాగభూషణ్ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు హెచ్‌ఎంగా కూడా వ్యవహరిస్తున్నారు. అయితే పాఠశాలలో మొత్తం విద్యార్థుల సంఖ్య, అందులో కొంతమంది పేర్లు సక్రమంగా చెప్పకపోవడంపై ప్రవీణ్‌ప్రకాష్ మండిపడుతూ.. పాఠశాలలో ఉన్న మొత్తం 406 మంది విద్యార్థుల ఫొటోలను తన వాట్సాప్‌కు పంపించాలని ఆదేశించారు.

ఆర్ట్, క్రాఫ్ట్ పీఈటీ సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక



సంఘ నాయకులతో రాష్ట్ర ప్రతినిధులు, పీఈటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆర్ట్ క్రాఫ్ట్ వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేద్దామని సంఘ జిల్లా నూతన ప్రధాన కార్యదర్శి లోపింటి డిల్లేశ్వరరావు అన్నారు. శనివారం నగరంలోని బాపూజీ కళామందిర్‌లో జిల్లా ఆర్ట్ క్రాఫ్ట్ వ్యాయామ ఉపాధ్యాయుల విస్తృతస్థాయి సమావేశం, నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు సైకం శివకుమారిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర నాయకులు కణితి తేజేశ్వరరావు, తమ్మినేని చందనరావు, జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షులు ఎం.వి.రమణ, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి పర్యవేక్షణలో ఈ నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. సంఘ జిల్లా అధ్యక్షునిగా ఎర్ర సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా లోపింటి డిల్లేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆర్ట్, క్రాఫ్ట్, వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేలా ఒత్తిడి తీసుకొస్తామని ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ కె.శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి ఎస్వీ రమణ భరోసా ఇచ్చారు. జిల్లా హెచ్‌ఎంల అసోసియేషన్ కార్యదర్శి అధ్యక్షుడు పేడాడ దాలినాయుడు, ఆర్ట్ క్రాఫ్ట్ పీఈటీ సంఘ రాష్ట్ర ప్రతినిధులు బి.శంకరరావు, కల్పనా రెట్టపల్లి, ఎం.వి.రమణ, రవిచందు, పీఈటీ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడలను మరింతగా విస్తరించాలి



డీఈఓ తిరుమల చైతన్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పీఈటీ సంఘ నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో అన్ని పాఠశాలలకు క్రీడలను విస్తరించాలని, విద్యార్థుల శారీరక దారుఢ్యానికి బాటలు వేయాలని డీఈఓ ఎస్.తిరుమల చైతన్య ఆకాంక్షించారు. డీఈఓగా బాధ్యతలు స్వీకరించిన తిరుమల చైతన్యను శనివారం జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు మొజ్జాడ వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి నేతృత్వంలో సభ్యులు మర్యాద పూర్వంకగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. పీడీ, పీఈటీలంతా మరింత సమన్వయంతో పని చేసి మంచి ఫలితాలను రాబట్టాలని డీఈఓ సూచించారు. పాఠశాల క్రీడల్లో ఈ ఏడాది అద్భుత ఫలితాలు, సాధించిన పీడీలు, పీఈటీలను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి బి.వి.రమణ, 2వ జోన్ అధ్యక్షుడు సింహాద్రినాయుడు, ఎం.ఆనంద్‌కిరణ్, హరీష్‌రాయుడు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేడుకగా ప్రపంచ పుస్తక దినోత్సవం

విజయనగరం అర్బన్: గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ప్రపంచ పుస్తక దినోత్సవం శనివారం వేడుకగా జరిగింది. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ సహాయక గ్రంథాలయ అధికారి డాక్టర్ డి.నారాయణ ముఖ్యఅతిథిగా హాజరై తొలిత జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలను ప్రారంభించారు. సదస్సు అనంతరం నిర్వహించిన వివిధ అంశాల పోటీల విజేతలకు ముఖ్యఅతిథి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ వెంకటలక్ష్మి, కళాశాల గ్రంథాలయ అధికారిణి డాక్టర్ లెంక సత్యవతి, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

25న సర్టిఫికెట్ల పరిశీలన

విజయనగరం టౌన్: ఏపీఎస్ ఆర్టీసీలో 2016 జనవరి ఒకటో తేదీ నుంచి 2019 డిసెంబర్ 31 మధ్యలో విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలో ఉద్యోగం చేస్తూ మృతి చెందిన వారి కుటుంబ సభ్యుల్లో ఒక్కరికి వారి అర్హతను బట్టి కారుణ్య నియామకాలను చేపట్టామని, వారి అర్హత తెలిపే సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 25న విజయనగరం డీపీటీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్నామని నెక్ రీజియన్ రీజనల్ మేనేజర్ ఆకాశపు విజయకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24న హాజరు కావాలని అభ్యర్థులకు సమాచారం ఇచ్చామని, అనివార్య కారణాల వలన 25వ తేదీకి వాయిదా వేశామన్నారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు విజయనగరం కార్యాలయంలో హాజరు కావాలని కోరారు.

కొట్లాట కేసు నమోదు

రేగిడి: మండలంలోని మునకవలస గ్రామంలో ఈ నెల 21న జరిగిన కొట్లాటకు సంబంధించి ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఇద్దరు అన్నదమ్ములు మధ్య స్థల వివాదం కారణంగా ఈ కొట్లాట జరిగినట్లు వెల్లడించారు. శాసపు తవిటినాయుడు, శాసపు రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశామని, దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సీతంపేట: మండలంలోని చింతాడకు చెందిన ఎస్.చిన్నారావు శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. తన ద్విచక్ర వాహనంపై చింతాడ నుంచి సీతంపేటకు వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన చిన్నారావును స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకురాగా వైద్యులు ప్రాథమిక చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నీలకంఠరావు తెలిపారు.

డెంకాడ: మండలంలోని విజయనగరం - నాతవలస ఆర్అండ్‌బీ రహదారిపై దొడ్డిబాడువ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. విజయనగరం వైపు నుండి నాతవలస వైపు వెళ్తున్న ఆటోను వెనుక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఓవర్ టేక్ చేస్తూ ఆటోను ఢీకొట్టిందని స్థానికులు తెలిపారు. దీంతో ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో ఆటో డ్రైవర్ బి.ఆదినారాయణ గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం విజయనగరం తరలించారు.

అన్నపై హత్యాయత్నం చేసిన తమ్ముడి అరెస్టు

బొబ్బిలి: పట్టణంలోని పాత బొబ్బిలిలో గుణుపూరు కృష్ణపై పెట్రోల్ పోసి హత్యాయత్నం చేసిన అతని తమ్ముడు గోపాల్‌ను అరెస్టు చేసినట్టు ఎస్ఐ పి.జ్ఞానప్రసాద్ విలేకర్లకు శనివారం తెలిపారు. ఈ నెల 20న వేకువజామున హత్యాయత్నం చేసిన వెంటనే గోపాల్ పరారయిన సంగతి పాఠకులకు తెలిసిందే.. కాగా బాధితుడు కృష్ణ ప్రస్తుతం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నట్టు ఎస్ఐ తెలిపారు.

అక్షరాలే ఆరాధ్య దైవాలు



ఆదివాసీలకు సవర భాష నేర్పుతున్న బోధకుడు

సండే స్పెషల్

అక్షరాలే భవిష్యత్.. వాటిని నేర్చుకుంటేనే దశ, దిశ మారుతుందన్న నమ్మకంతో ఆదివాసీ ప్రాంతాల్లో అక్షర ఉద్యమం ఊపందుకుంది. మాతృభాషలోని అక్షరాలనే విగ్రహాలుగా మలిచి పూజించే సంప్రదాయం కొనసాగుతోంది. ఆదివాసీల్లో అక్షరచైతన్యం తెస్తోంది. మూఢనమ్మకాలను దూరం చేస్తోంది. అవకాశాలను అందిపుచ్చుకునేందుకు దోహదపడుతోంది. ఊరూరా సాగుతున్న ఆదివాసీల అక్షర ఉద్యమంపై ఈ వారం సాక్షి సండే స్పెషల్.

- అక్షరబ్రహ్మ దేవాలయాల్లో అక్షరాలే విగ్రహాలు
- సవర భాషా లిపిని దైవంగా పూజించే అరుదైన సంప్రదాయం
- ఆదివాసీలు కొనసాగిస్తున్న అక్షర ఉద్యమం

భామిని: చెట్లు, రాళ్లు, రప్పలు, చిత్ర పటాలు, సరిహద్దులను దైవాలుగా పూజించడం ఆదివాసీల సంప్రదాయం. ప్రకృతితో మమేకమవుతారు. రుతువులతో 'సాగు'తారు. అదే స్థాయిలో మూఢనమ్మకాలను సైతం బలంగా నమ్ముతారు. వీటి నుంచి బయటపడాలంటే అక్షర చైతన్యం అవసరం. దీనికోసం ఓ ఉద్యమం ఊపందుకుంది. మాతృభాష అయిన సవరభాషకు గుర్తింపునిచ్చే అక్షర రూపాలనే దేవతలుగా ఆరాధించే అరుదైన ఆచారాన్ని ఆదివాసీ గిరిజనులు కొనసాగిస్తున్నారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని ఆదివాసీలు మాట్లాడే సవరభాషకు అక్షర రూపం కల్పించి, సవర లిపిలోని అక్షరాలను విగ్రహాలుగా ఆరాధిస్తున్నారు. ఊరూరా అక్షర బ్రహ్మ ఆలయాలు కట్టిస్తున్నారు. అక్షరబ్రహ్మ ఆలయాల ప్రాముఖ్యతను చాటిచెప్పేందుకు మాతార్బన్ పేరుతో ప్రత్యేక ఉద్యమ రూపంలో ప్రచారం సాగిస్తున్నారు. దీక్షలు, ఉపవాసాలు, కఠోర నియమాలతో మతార్బనమ్ ప్రచారకులు గిరిజన గూడలలో సవరలిపిపై విస్తృత ప్రచారం చేస్తున్నారు.



మతార్బనమ్ ప్రచారంలో ఆదివాసీ మహిళల అక్షరదీక్ష పూజలు

పుష్కరకాలం శ్రమించి..

ఆదివాసీలు మాట్లాడే సవరభాషకు లిపి లేకపోతే సమాజంలో గుర్తింపు లేదని, ఆదివాసీల్లో అక్షర చైతన్యం కలిగించకపోతే జీవితాల్లో మార్పురాదని సవర పండిత్ మంగై గుమాంగో భావించారు. పుష్కరకాలంపాటు సాధన చేసి ప్రత్యేక లిపిని రూపొందించారు. 1936లో అక్షయ తృతీయ నాడు సవర లిపిని పరిచయం చేశారు.

అక్షరబ్రహ్మ విగ్రహాలు ఇవే ...

సవర పండిత్ మంగై గుమాంగో సవర లిపికి 24 అక్షరాలు, ఒక పొల్లు అక్షరాన్ని రూపొందించారు. వీటిని విగ్రహాలుగా మలిచి అక్షరబ్రహ్మ ఆలయాల్లో ప్రతిష్ఠించారు. వీటిని పూజిస్తూనే ప్రతీ ఒక్కరూ నేర్చుకునే సంప్రదాయాన్ని తెచ్చారు. 1952లో ఒడిశాలోని మిర్చిగూడలో మెదటి అక్షరబ్రహ్మ ఆలయం నిర్మించారు. 24 సవర భాషాఅక్షరాల్లో 16 హల్లులు, 8 అచ్చులు, ఒక పొల్లు అక్షరాన్ని విగ్రహాలుగా ప్రతిష్ఠించారు.

ప్రచార ఉద్యమం..

అక్షరబ్రహ్మ ప్రచార ఉద్యమం మతార్బనమ్ పేరున సాగుతోంది. దురాలవాటులకు ఆదివాసీలను దూరం చేస్తున్నారు. మిర్చిగూడలోని అక్షరబ్రహ్మ ఆలయం మాదిరి సరిహద్దు గ్రామాల్లోనూ ఆలయాలు నిర్మిస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం మనుమకొండ, పాలవలసలోనూ, సీతంపేట మండలం నౌగడ, ముత్యాలు, శంభాం గ్రామాల్లోనూ, గుమ్మలక్ష్మీపురం మండలం కన్నాయిగూడ, పెద్దగూడ గ్రామాల్లో అక్షరబ్రహ్మ అలయాలు వెలిశాయి. సతివాడ మెట్టపై మాతార్బనమ్ ప్రచారం కోసం భారీ అక్షరబ్రహ్మ ఆశ్రమం నిర్మించారు. ప్రత్యేక అలంకరణలతో స్వాగత ద్వారాలతో తీర్చిదిద్దారు. జామిగూడ, తాటిమానుగూడ, దోనుభాయి, నౌగడ తదితర గ్రామాల్లో అక్షర బ్రహ్మ యువ నిర్మాణ సేవా కేంద్రాల పేరున ప్రచార మందిరాలు వెలస్తున్నాయి.

లిపికి గుర్తింపు..

భారత దేశంలోనే మొదటిగా ఆదివాసీల మాతృభాష్య అయిన సవరభాష అక్షరాలను ప్రింటింగ్ వేసే ప్రెస్ ఒడిశాలోని డొంబుసారాలో 1976లో ఏర్పాటైంది. భారతీయ భాషలలో గుర్తింపుగా 1976 మార్చి 26న బెంగుళూరులోని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్‌లో గుర్తించినట్టు డైరెక్టర్ డాక్టర్ డి.పి.పట్నాయక్ ప్రకటించారు.

జాతీయ స్థాయిలో...

ఇటీవల మనుమకొండలో జరిగిన అక్షరబ్రహ్మ యువ నిర్మాణ సేవా సంఘం జాతీయ స్థాయి సదస్సులో ఐదు రాష్ట్రాల ప్రతినిధులు, మతార్బనమ్ ప్రచారకులు సవరభాషను జాతీయ భాషగా గుర్తింపు తెచ్చేందుకు కృషిచేయాలని తీర్మానించారు. ఈశాన్యరాష్ట్రాలలో సరవభాషా ఉద్యమాన్ని ఉధృతం చేయాలని నిర్ణయించారు. ఒడిశా నుంచి మాజీ ముఖ్యమంత్రి గిరిధర గుమాంగో, మాజీ ఎమ్మెల్యే రామూర్తి గుమాంగో, సవర భాష ఆవిష్కరించిన మంగయ్య కుమారుడు, సవర లిపి ప్రచార జాతీయ అధ్యక్షుడు డిగాన్సిమ్ గుమాంగో, అస్సాం నుంచి వచ్చిన పాగోని బోయా, గాబ్రియల్ బోయా, లోక్మి బోయాలు చర్చించారు.

సవరభాష గుర్తింపుకోసం..



ఆదివాసీల మాతృభాష సవర భాషకు గుర్తింపు కోసం మతార్బనమ్ పేరున విస్తృత ప్రచారం చేస్తున్నాం. గూడ గూడల్లో అక్షరబ్రహ్మ ఉద్యమాన్ని నిర్వహిస్తున్నాం. అక్షర బ్రహ్మ ఆలయాలు, మందిరాలతో పాటు అక్షర బ్రహ్మ దీక్షలు, వ్రతాలను అమలు చేస్తున్నాం. సతివాడ వద్ద పవిత్రకొండ పేరున ఆశ్రమంలో బోధకులకు శిక్షణ ఇస్తున్నాం. బోధకులతో సవర భాషను నేర్పుతున్నాం. దురాచారాలను దూరం చేస్తున్నాం.

– సవర కరువయ్య, మతార్బనమ్ జిల్లా కోఆర్డినేటర్, సతివాడ పవిత్ర ఆశ్రమం



మనుమకొండలో అక్షర బ్రహ్మ ఆలయం



అక్షర మూర్తులకు ఆదివాసీ విద్యార్థుల భజనలు

పిడుగుపాటుకు కూలీ మృతి



పిడుగుపాటుతో చనిపోయిన అప్పారావును తీసుకొస్తున్న గ్రామస్తులు



బొంగరాల అప్పారావు (ఫైల్)

శృంగవరపుకోట: ఉపాధి కోసం వెళ్లిన భార్యాభర్తల్లో భార్య కళ్లెదుటే భర్త పిడుగుపాటుకు గురై శనివారం మృతి చెందాడు. దీంతో భార్య సొమ్మసిల్లి పడిపోయింది. ఈ విషాదకర ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు.. మామిడిపల్లి గ్రామంలో ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న బొంగరాల అప్పారావు(45) తన భార్య లక్ష్మణ, తల్లి, ఇద్దరు కుమారులతో నివాసం ఉంటున్నాడు. అప్పారావు నిత్యం తన భార్యతో కూలి పనులకు వెళ్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. రోజులాగే శనివారం కూడా కొట్టాం జంక్షన్ సమీపంలోని ఇటుక బట్టీలో పనికి వెళ్లారు. మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత మూడు గంటల సమయంలో మళ్లీ పనికి సిద్ధమయ్యారు. భార్యాభర్తలు అప్పారావు, లక్ష్మణ ఒకే చోట పని చేస్తున్న సమయంలో అప్పారావు వాటర్ బాటిల్ పక్కన పెట్టేందుకు పెద్ద శబ్దంతో పిడుగు పడింది. దీంతో అప్పారావు శరీరం కాలిపోయి క్షణాల్లో మృత్యువాత పడ్డాడు. తన కళ్ల ముందే భర్త మృత్యువాత పడడంతో తట్టుకోలేని భార్య లక్ష్మణ సొమ్మసిల్లి పడిపోయింది. దీన్ని గమనించిన పరిసరాల్లో ఉన్న కూలీలు వచ్చి చూడగా అప్పారావు అప్పటికే చనిపోయాడు. భార్య లక్ష్మణకు సపర్యలు చేయగా స్పృహలోకి వచ్చింది. భర్తను చూసి కన్నీరుమున్నీరైంది. ఈ ఘటన చూపరులను కంటతడి పెట్టించింది. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పుస్తక సేకరణకు ప్రత్యేక డ్రైవ్

విజయనగరం అర్బన్: ప్రపంచ పుస్తక దినోత్సవం పురస్కరించుకొని పుస్తక సేకరణ కోసం ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామని జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి కె.దయానంద్ తెలిపారు. శనివారం పులువురు పుస్తకదాతల ఇళ్లకు వెళ్లి పుస్తకాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం ఎంత పెరిగినా పుస్తకాలకున్న విలువ తగ్గదని, పుస్తక పఠనం విజ్ఞాన దాయకమే కాకుండా ఆరోగ్యదాయకమని అన్నారు. సంఘం ఆధ్వర్యంలో పుస్తక హుండీ గత కొంత కాలంగా చేపడుతున్నామని ఇళ్లల్లో వృథాగా ఉన్న విలువైన పుస్తకాలను సేకరించి అవసరమైన విద్యార్థులకు గ్రంథాలయాలకు అందజేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని అన్నారు. పుస్తకాలు అందజేయాలనుకునే వాళ్లు 9849377577 ఫోన్ నంబరును సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్, జయంతి కామేశ్వరి, పద్మ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చేతక్ షోరూం ప్రారంభం



బజాజ్ చేతక్ ఎలక్ట్రిక్ వాహనాన్ని కొనుగోలుదారులకు అందజేస్తున్న చిత్రం

విజయనగరం: బజాజ్ ఆటో వారి సరికొత్త చేతక్ షోరూం శనివారం విజయనగరంలో ఘనంగా ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జోనల్ మేనేజర్ జిఎస్.ఆరాధ్యుల, ఏరియా సర్వీస్ మేనేజర్ అరుణ్‌కుమార్ వెంకటేషన్‌ల చేతుల మీదుగా నూతనంగా షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా వరుణ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ దేవ్ మాట్లాడుతూ చేతక్ కస్టమర్‌ల కోసం విజయనగరంలో నూతన షోరూం ప్రారంభించటం ఆనందంగా ఉందన్నారు. గతంలో ఫ్యామిలీ స్కూటర్‌గా ప్రసిద్ధి చెందిన బజాజ్ వారి చేతక్ నేడు సరికొత్త అవతారంలో ఎలక్ట్రిక్ వాహనంగా రూపుదిద్దుకొని మార్కెట్‌లోకి ప్రవేశించిందని తెలిపారు. బజాజ్ చేతక్ ఎలక్ట్రిక్ స్కూటర్‌లకు కస్టమర్ల నుంచి అనూహ్యమైన స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో వరుణ్ బజాజ్ సీఈఓ శ్రీనివాస్, చేతక్ ఏరియా సేల్స్ మేనేజర్ గోపాల్, సిబ్బంది, కస్టమర్లు పాల్గొన్నారు.

30న ఏపీజీఈఏ రాష్ట్ర సదస్సు



మాట్లాడుతున్న జిల్లా కమిటీ అధ్యక్షుడు రామచంద్ర రావు

విజయనగరం అర్బన్: రాజమండ్రిలో ఈ నెల 30వ తేదీన నిర్వహించే సంఘం రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ) జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. జిల్లా కమిటీ స్థానిక సంఘం కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించింది. సమావేశంలో సంఘ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయిలో కృషి చేస్తున్నామని రాష్ట్ర స్థాయిలో ఉద్యోగుల ఆకాంక్షలు నెరవేర్చడానికి రాష్ట్ర కమిటీ శ్రమిస్తుందని అన్నారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపునకు సభ్యులు స్పందించి అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పి.రామచంద్రరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యదర్శి కంటి వెంకటరమణ, రాష్ట్ర కార్యదర్శి ఎల్‌వీ యుగంధర్, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ పువ్వల శ్రీనివాసరావు, కోశాధికారి వై.శంకరరావు, ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి శ్రీను, పట్టణ అధ్యక్షుడు బాలభాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

రండి.. ఈదేద్దాం...



స్విమ్మింగ్ పూల్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- వేసవి సందడి
- సిద్ధమైన ఆక్వా స్విమ్మింగ్ పూల్
- నెలకు పెద్దలకు రూ.1000, చిన్నారులకు రూ.500 చొప్పున ప్రవేశ రుసుం
- ఇదే ప్రాంగణంలో రెండు జిమ్‌ల సేవలు అందుబాటులోకి
- ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణకు అవకాశం



వేసవి సందడికి సిద్ధమైన ఆక్వా స్విమ్మింగ్ పూల్

విజయనగరం: ఈత (స్విమ్మింగ్) సాధకులకు శుభవార్త. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని కంటోన్మెంట్ ప్రాంతంలో గల ఆక్వా స్విమ్మింగ్ పూల్ వేసవి సందడి సిద్ధమైంది. గతేడాది వరకు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన పూల్‌ను నెలకు రూ.1.08 లక్షలు వసూలు చేస్తూ ఈ ఏడాది మార్చి 27 నుంచి 3 ఏళ్ల పాటు ప్రైవేటు సంస్థకు అప్పగించగా... సదరు నిర్వాహకులు వేసవి శిక్షణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో గతంలో నిర్మించిన స్విమ్మింగ్ పూల్ ఆధునిక వసతులతో తాజాగా మళ్లీ స్విమ్మర్లకు ఆహ్వానం పలుకుతోంది. మరమ్మతులు, ఆధునీకరణ పనుల కోసం ఈ స్విమ్మింగ్ పూల్ గత కొంతకాలంగా మూసివేశారు. దీని నిర్వహణ బాధ్యతలను ప్రైవేటు సంస్థకు అప్పగించిన తర్వాత ఆ సంస్థ రూ.28 లక్షలతో దీనిని ఆధునీకరించి మరిన్ని వసతులతో సిద్ధం చేసింది.

నగరంలోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో గల స్విమ్మింగ్ పూల్‌లో ప్రతి ఏడాది ఎంతో మంది చిన్నారులు, పెద్దలు సాధన చేస్తుంటారు. అందులో భాగంగానే ఈ ఏడాది ఔత్సాహికులను ప్రోత్సహించే దిశగా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రతి రోజు ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సాధకులకు అనుమతించనున్నారు. ఈత సాధనకు వచ్చే వారి నుంచి గతంలో మాదిరి నెల వారి రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకోసం పెద్దలు రూ.1000 చొప్పున చెల్లించాల్సి ఉండగా.... 12 ఏళ్లలోపు చిన్నారుల నుంచి రూ.500 చొప్పున చెల్లించేలా నిర్ణయించారు. ప్రతి ఒక్కరు రోజులో గంట పాటు ఈత సాధన చేసేందుకు అవకాశం కల్పిస్తారు. సాధన కోసం వచ్చే వారు ప్రత్యేక దుస్తులు ధరించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు.

మరింత మంది జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలి: కోలగట్ల

ఆక్వా స్విమ్మింగ్ పూల్‌లో సాధన చేసిన క్రీడాకారులు పలు రాష్ట్ర, జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో సత్తా చాటారని, అదే బాటలో మరింత మంది జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆకాంక్షించారు. నగరంలోని కంటోన్మెంట్ ప్రాంతంలో గల ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణంలోని స్విమ్మింగ్ పూల్‌ను ఆయన శనివారం పునఃప్రారంభించారు. అనంతరం స్విమ్మింగ్ పూల్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించి, వారికి అవసరమైన వసతులు కల్పించేందుకు సిద్ధంగా వున్నామని చెప్పారు. అన్ని రంగాలతో పాటు క్రీడారంగాన్ని కూడా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వున్నారని, అందులో భాగంగానే ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ సహాయ సహకారాలతో నగరంలోని అన్ని స్టేడియంలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లలో వసతుల కల్పనకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. రాజీవ్ స్టేడియంలో రాత్రివేళల్లో నడకకు వీలుగా లైట్లు ఏర్పాటు చేయించామని, రానున్న రోజుల్లో క్రీడాకారులకు ఎలాంటి వసతులు కావాలన్నా కల్పించేందుకు సిద్ధంగా వున్నామని చెప్పారు. డీఎస్ఏ ఇండోర్ స్టేడియం ఆధునీకరణకు రూ.20 లక్షలతో ఇటీవల శంకుస్థాపన చేయటం జరిగిందని తెలిపారు. ఇక్కడి స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ పొందిన బాలబాలికలు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఎంతగానో రాణించారని డిప్యూటీ స్పీకర్ పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఎందరో స్విమ్మర్లను తీర్చిదిద్దేందుకు ఈ ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ దోహదపడగలదని ఆకాంక్షను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సెట్విజ్ సీఈఓ రాంగోపాల్, వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ వి.ఎస్.ప్రసాద్, స్థానిక కార్పొరేటర్ బోనెల ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో రెండు జిమ్‌లు

ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో ఈత కొలనుతో పాటు రెండు జిమ్‌లు అందుబాటులోకి వచ్చాయి. వ్యాయామ సాధకుల కోసం వీటిలో ఉన్న యంత్రాలను, ఇతర సామగ్రిని మరమ్మతులు చేశారు. ఈ జిమ్‌లలో సాధన చేసేందుకు నెలవారి రుసుం చెల్లించాల్సి ఉంటుంది. పాత జిమ్‌లో సాధన చేయాలనుకునే వారు రూ.రూ.300, ఆధునాతన పరికరాలతో కూడిన మరో జిమ్‌లో సాధనకు రూ.600గా ధర నిర్ణయించారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో జిమ్‌లు అందుబాటులో ఉండనున్నాయి.

చందనసేవకు వేళాయెె



అప్పన్న నిజరూపం

సింహాచలం: దుష్టసంహారానికి ఉగ్రరూపధారియైన నృసింహుడు భక్తుల అభీష్టం నెరవేర్చేందుకు అనేక చోట్ల స్వయంభువుగా వెలిశాడు. అలాంటి ప్రసిద్ధ క్షేత్రాలలో సింహగిరి ఒకటి. తూర్పు కనుమలలో ప్రకృతి సౌందర్యం నడుమ సింహాద్రిపై పశ్చిమాభిముఖుడైన శ్రీ వరాహ లక్ష్మీనృసింహుడు అశేష భక్తకోటికి ఇష్టదైవం. వైశాఖ శుద్ధ తదియ నాడు భక్తజనకోటికి నిజరూప దర్శనం అనుగ్రహిస్తాడు. చందనయాత్ర నాడు నిజరూపం దర్శనం వైకుంఠంలో లక్ష్మీనారాయణులను దర్శించినంత ఫలితమని క్షేత్ర మహత్యం పేర్కొంటోంది.

ఆదివారం జరగనున్న చందనోత్సవానికి అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. తెల్లవారు జామున ఒంటి గంట నుంచి ఆలయ అర్చకులు వైదిక కార్యక్రమాలు ప్రారంభిస్తారు. స్వామివారిపై ఉన్న చందనాన్ని శాస్త్రోక్తంగా ఒలిచి నిజరూప భరితున్ని చేస్తారు. అనంతరం దేవస్థానం వంశపార ధర్మకర్త పుసపాటి అశోక్‌గజపతిరాజుకి తొలిదర్శనం కల్పిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామివారికి దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పట్టువస్త్రాలు సమర్పిస్తారు. టీటీడీ తరపున సంప్రదాయ వస్త్రసమర్పణ ఉంటుంది. ఉదయం 4 గంటల నుంచి సర్వదర్శనం భక్తులకు అందజేస్తారు. రాత్రి 7 గంటల వరకే భక్తులను క్యూల్లోకి అనుమతిస్తారు. తరువాత క్యూల ప్రవేశ ద్వారాలు మూసివేసి అప్పటి వరకు క్యూల్లో ఉన్న భక్తులకు స్వామివారి దర్శనాన్ని కల్పిస్తారు. రాత్రి 8.30 గంటల నుంచి పాంచరాత్ర ఆగమశాస్త్ర పండితులు త్రిదండి చినజీయర్‌స్వామి పర్యవేక్షణలో స్వామికి సహస్రఘటాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. సింహగిరిపై ఉన్న గంగధార వద్ద నుంచి శ్రీవైష్ణవ స్వాములు కలశాలతో నీటిని తీసుకురాగా స్వామికి అభిషేకం చేస్తారు. పంచామృతాభిషేకాలు నిర్వహిస్తారు. తదుపరి విశేష పూజలు నిర్వహించిన అనంతరం స్వామికి తొలివిడతగా మూడు మణుగుల చందనాన్ని సమర్పిస్తారు.

పకడ్బందీ ఏర్పాట్లు

ఈసారి 1.50 లక్షల మంది భక్తులు వస్తారని జిల్లా యంత్రాంగం అంచనా వేసింది. సర్వదర్శనంతో పాటు రూ.300, రూ.1000 దర్శనం టికెట్లు, రూ.1500 వీవీఐపీల టికెట్లు అందుబాటులో ఉంచారు. తొలిసారిగా రూ.300, రూ.1000 టికెట్లు ఆన్‌లైన్‌లో విక్రయాలు జరిపారు. కాగా రూ.300 దర్శనం టికెట్లపై వేచ్చేవారికి కూడా వివిధ స్లాట్‌ల్లో దర్శన సమయాన్ని కేటాయించారు. కలెక్టర్ మల్లికార్జున, దేవస్థానం ఈవో త్రినాథరావు, జీవీఎంసీ, ఫైర్, ఆర్టీసీ, మెడికల్ అండ్ హెల్త్, పోలీస్, ఫైర్, రెవెన్యూ తదితర శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేశారు. కాగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ త్రివిక్రమ్ వర్మ ఆధ్వర్యంలో పన్నెండు వందలకి పైగా పోలీసులు చందనోత్సవం బందోబస్తు నిర్వహించనున్నారు. చందనోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలోని ప్రహ్లాదమండపాన్ని విశేషంగా పూలతో అలంకరించారు.

చందనంలో సుగంధ ద్రవ్యాల మేళవింపు

చందనోత్సవాన్ని పురస్కరించు కుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సమర్పించే మూడు మణుగుల పచ్చిచందనంలో శని వారం దేవస్థానం అర్చకులు పలు రకాల సుగంధ ద్రవ్యాలను కలిపారు. ఈ చందనాన్ని ఆదివారం రాత్రి సహస్ర ఘటాభిషేకం అనంతరం స్వామికి సమర్పించనున్నారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యు లు, ఇరగవరపు రమణాచా ర్యులు, పురోహిత్ అలంకారి కరి సీతా రామాచార్యులు, అర్చకులు కార్యక్రమాన్ని నిర్వహించారు.